క్లుప్తంగా

వాహనాల తనిఖీ



తిరువూరు: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా తెలంగాణ-ఆంధ్ర రాష్ట్ర సరిహద్దుల్లో తిరువూరు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తిరువూరు సీఐ అబ్దుల్ నబీ, ఎస్ఐ సత్యనారాయణ, సీఐ ఎస్ఎఫ్ బలగాలతో వచ్చే పోయే వాహనాలను తనిఖీ నిర్వహించారు. అనుమతికి మించి నగదు తీసుకెళితే సీజ్ చేస్తామని సీఐ తెలిపారు.

ఆత్మీయ సమావేశానికి తరలిన నేతలు



విస్సన్నపేట: తిరువూరులో జరిగిన వైఎస్సార్ సీపీ మాదిగల ఆత్మీయ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి మాదిగల నాయకులు, మహిళలు భారీగా తరలి వెళ్లారు. విస్సన్నపేటలో స్థానిక శ్రీశ్రీ కళాశాల వద్ద నుంచి మాదిగ నాయకులు ర్యాలీగా తరలి వెళ్లారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు గద్దల మల్లయ్య, సొసైటీ మాజీ అధ్యక్షుడు మేకల రవి, సీనియర్‌నాయకుడు గొర్రె లాజరస్, దాసు, ప్రసాద్, చిన్నప్ప, కిరణ్, తాణంకి రాంబాబు, పల్లెపాం లక్ష్మయ్య, కోపూరి తిరుపతిరావు, ఏషియా తదితరులు వెళ్లారు.

వ్యక్తి అనుమానాస్పద మృతిపై కేసు



గబ్బర్ మృత దేహం

ఇబ్రహీంపట్నం: వ్యక్తి అనుమానాస్పద మృతిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జూపూడిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ స్పృహతప్పి పడిపోయిన ముప్పాల గబ్బర్ (41) స్థానిక నిమ్రా వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేసిన భార్య ముప్పాళ్ల సుజాత పోలీస్ స్టేషన్‌లో అదేరోజు రాత్రి ఫిర్యాదు చేసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన గబ్బర్ కేతనకొండకు చెందిన సుజాతను గతంలో వివాహం చేసుకున్నాడు. జూపూడి ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న సమయంలో స్పృహ తప్పి పడిపోయాడు. కంపెనీలో పనిచేస్తున్న మరో వ్యక్తి విషయాన్ని ఫోన్ ద్వారా భార్యకు చేరవేసి నిమ్రా వైద్యశాలకు తరలించాడు. గబ్బర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భర్త నుదిటిపై గాయం ఉండటంతో పోలీసులకు భార్య ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ పాపారావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

విశ్వాసంతో ప్రార్థించాలి



తిరువూరు: తపస్సు కాలంలో విశ్వాసంతో దేవుని ప్రార్థించిన వారికి కోర్కెలు నెరవేరతాయని ఫాదర్ రెవరెండ్ వేము మోజెస్ అన్నారు. మంగళవారం తిరువూరు మధిర రోడ్డులోని సహాయమాత ఆర్సీఎం చర్చిలో తపస్సు కాల ధ్యాన కూటాలు జరిగాయి. ఈ సందర్భంగా మోజెస్ వాక్యోపదేశం చేశారు. తపస్సు కాల మండల దినాల్లో నిష్ఠతో దేవుని ప్రార్థించి, దానధర్మాలు చేస్తూ ప్రభువుని ఆరాధించే వారికి ఏసుక్రీస్తు ఆశీర్వాదాలు లభిస్తాయన్నారు. ఆర్‌సీఎం విచారణ గురువు విజయ్‌కుమార్ స్వస్థత ప్రార్థనలు, దివ్యబలిపూజ, దివ్య సత్ప్రసాద స్వీకరణ కార్యక్రమాలు నిర్వహించారు. విచారణ పరిధిలోని పలు గ్రామాల నుంచి విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



జి.కొండూరు: తెలంగాణ రాష్ట్రం, ఎర్రుపాలెం నుంచి అక్రమంగా మద్యం బాటిళ్లతో జి.కొండూరు వైపు వస్తున్న పొట్లదుర్తి సాంబశివరావుని గంగినేని శివారులోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద జి.కొండూరు పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 24 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షబ్బీర్ అహ్మద్ తెలిపారు.

ప్రభుత్వ వైద్యం ప్రజల చెంతకు

- నాడు నరకానికి ఆనవాళ్లు
- నేడు ఆధునిక ఆస్పత్రులు
- సుమారు రూ.46 కోట్లకు పైగా నిధులతో ఆస్పత్రుల ఆధునికీకరణ, వైద్య సేవలు



మైలవరంలో నూతనంగా నిర్మించి 50 పడకల ఆస్పత్రి భవనం



జి.కొండూరు: నాటి పాలనలో పేదలకు అందని ద్రాక్షలా మారిన విద్య, వైద్యాన్ని కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా అందించేందుకు నేడు ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన చర్యలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసిన ఆస్పత్రులను నేడు ఆధునిక దేవాలయాలుగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది. నాడు-నేడు కింద అన్ని వసతులతో అధునికీకరించారు. ప్రభుత్వాస్పత్రులలో ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్ నమోదు పెరగడంతో పాటు ప్రసవాలు కూడా పెరగడం చూస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని అర్థమవుతోంది.

నియోజకవర్గంలో ఆస్పత్రుల అభివృద్ధి ఇలా..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2019-24 మధ్య కాలంలో మైలవరం నియోజకవర్గ పరిధిలోని మైలవరం పట్టణ ప్రభుత్వాస్పత్రి 30 పడకల నుంచి 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ రూ.3 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించి అధునిక వసతులు కల్పించారు. చంద్రాల పీహెచ్‌సీని నాడు-నేడు కింద అధునికీకరించారు. జి.కొండూరు పీహెచ్‌సీని నాడు-నేడు కింద అధునికీకరించగా వెలగలేరు పీహెచ్‌సీకి నూతన భవనాన్ని రూ.1.82 కోట్లతో పునఃనిర్మించారు. రెడ్డిగూడెం పీహెచ్‌సీని నాడు-నేడు కింద అధునికీకరించారు. ఇబ్రహీంపట్నం పరిధిలోని ఇబ్రహీంపట్నం, కొండపల్లిలో నూతనంగా రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలు రూ.1.60 కోట్లతో నిర్మించారు. కొండపల్లిలో ఈఎస్ఐ ఆస్పత్రిని రూ.54 లక్షలతో నూతనంగా నిర్మించారు. ఇబ్రహీంపట్నం, కొండపల్లి పీహెచ్‌సీలను నాడు-నేడు కింద ఆధునికీకరించారు.

ఇంటి వద్దకే వైద్యం..

గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని చేరువ చేసేందుకు ఇప్పటికే వైఎస్సార్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లను నిర్మించిన ప్రభుత్వం ఈ సెంటర్ల ద్వారా వైద్య సేవలను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వాస్పత్రులు, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లే కాకుండా 108, 104, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి వినూత్న కార్యక్రమాలతో ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్య సేవలను అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.25 లక్షల విలువైన వైద్య సేవలను ప్రజలకు ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చారు.

మైలవరం నియోజకవర్గంలో ఆస్పత్రులు, వైద్య సేవల వివరాలు

ఆస్పత్రులు	10
నూతనంగా నిర్మించిన ఆస్పత్రులు	5
అధునికీకరించిన ఆస్పత్రులు	5
వైఎస్సార్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లు	67
ఆస్పత్రుల అభివృద్ధికి ఖర్చు	రూ.7.88 కోట్లు
వెల్నెస్ సెంటర్ల నిర్మాణ ఖర్చు	రూ.15.94 కోట్లు
ఆరోగ్యశ్రీపై ఖర్చు	రూ.22.34 కోట్లు
ఇన్ అండ్ అవుట్ పేషెంట్స్ నెలకు	50 వేలకు పైగా
ఆస్పత్రులలో వైద్య సేవలు రకాలు	17
అందుబాటులో ఉండే మందుల రకాలు	172
హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లలో మందుల రకాలు	105
ప్రభుత్వం అందిస్తున్న సర్జికల్స్ రకాలు	104



జి.కొండూరులో నాడు-నేడు కింద ఆధునికీకరించిన పీహెచ్‌సీ భవనం



వెలగలేరులో పునఃనిర్మించిన పీహెచ్‌సీ భవనం



కవులూరులో నిర్మించిన హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్

ప్రభుత్వాస్పత్రులపై నమ్మకం కలిగింది



గతంలో ప్రభుత్వాస్పత్రికి పోవాలంటే భయపడేవాళ్లం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆస్పత్రులను అందంగా తయారు చేశారు. డాక్టర్లు కూడా ప్రేమగా చూస్తున్నారు. ఆస్పత్రిలో అన్ని మందులు అందుబాటులో ఉంటున్నాయి. సౌకర్యాలు పెరిగాయి. మా లాంటి వాళ్లు ప్రైవేటు ఆస్పత్రుల వైపు చూడకుండా చేశారు.

–పజ్జూరు గోవిందమ్మ, జి.కొండూరు గ్రామం

చికిత్స బాగుంది..



గవర్నమెంట్ ఆస్పత్రిలో గతంలో కంటే ఇప్పుడు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. మంచి మందులు ఇస్తున్నారు. ప్రైయివేటు ఆస్పత్రికి వెళ్లే పనిలేకుండా అన్ని సౌకర్యాలు ఇస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల కన్నా గవర్నమెంట్ ఆస్పత్రులే బాగున్నాయి. మంచి వైద్యం అందిస్తున్నారు.

–కూరెళ్ల జయపుష్పవతి, జి.కొండూరు

పేషెంట్లు పెరిగారు..



పీహెచ్‌సీకి వస్తున్న పేషెంట్లు ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పేషెంట్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో కంటే ఇప్పుడు పేషెంట్లు పెరిగారు. ప్రసవాలు పెరిగాయి. అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉంటున్నాయి.

–డాక్టర్ మాధురిదేవి, వెలగలేరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి

రూ.61 లక్షలతో రోడ్డు మరమ్మతులు



నూజివీడు-ఆగిరిపల్లి మధ్య రోడ్డుకు ప్యాచ్ వర్కు చేస్తున్న కూలీలు

నూజివీడు: నూజివీడు-ఆగిరిపల్లి రహదారి మరమ్మతు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. విస్సన్నపేట, చాట్రాయి, చింతలపూడి, తెలంగాణ రాష్ట్రమైన సత్తుపల్లి, అశ్వారావుపేట తదితర ప్రాంతాల ప్రజలు విజయవాడ వెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారి. నిరంతరం రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో నూజివీడు-ఆగిరిపల్లిల మధ్య రహదారి గోతులమయంగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషితో డిస్ట్రిక్ మినరల్ ఫండ్స్ (డీఎంఎఫ్) నుంచి ప్రభుత్వం రహదారి మరమ్మతు పనులకు రూ.61 లక్షలు మంజూరు చేసింది. వీటిలో కొత్తూరు నుంచి రావిచర్ల అడ్డరోడ్డు వరకు రూ.21 లక్షలు, రావిచర్ల అడ్డరోడ్డు నుంచి ఆగిరిపల్లి వరకు రూ.40 లక్షలు మంజూరు కావడంతో కాంట్రాక్టర్ మరమ్మతు పనులను శరవేగంగా నిర్వహిస్తున్నారు. ప్యాచ్ వర్కులు పూర్తయినట్లయితే రహదారి పరిస్థితి మెరుగై వాహనదారుల కష్టాలకు తెరపడనుంది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ముసునూరు: పాము కాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. ఎస్సై పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాట్రేనిపాడుకు చెందిన పిన్నిబోయిన వీరయ్య కుమార్తె అంగడాల భవాని (30) ఈ నెల 17వ తేదీన మొక్కజొన్న చేనులో పనికి వెళ్లింది. అక్కడ పని చేస్తూ ఉండగా పాము కాటుకు గురవడంతో బంధువులు ఆమెను నూజివీడులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఆమె మృతి చెందినట్లు తెలిపారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్సై చెప్పారు.

రెండో రోజు ప్రశాంతంగా ‘పది’ పరీక్షలు



చెక్కపల్లిలో హిందీ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

నూజివీడు: నియోజకవర్గంలో పదో తరగతికి నిర్వహిస్తున్న 17 పరీక్ష కేంద్రాల్లో మంగళవారం హిందీ పరీక్షకు 3,300 మంది విద్యార్థులు హాజరు కాగా 178 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. నూజివీడు పట్టణంతో పాటు నూజివీడు పట్టణం, మండలంలో కలిపి 9 పరీక్ష కేంద్రాల్లో 1,778 మంది హాజరుకాగా 87 మంది గైర్హాజరయ్యారు. ఆగిరిపల్లి మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో 596 మంది హాజరు కాగా 29 మంది గైర్హాజరయ్యారు. చాట్రాయి మండలంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో 346 మంది హాజరు కాగా 27 మంది గైర్హాజరయ్యారు. ముసునూరు మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 580 మంది హాజరుకాగా 35 మంది గైర్హాజరయ్యారు. వేసవికాలం దృష్ట్యా పరీక్షల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఏఎన్‌ఎంలను నియమించారు.

మైలవరం: మండలంలో రెండో రోజు మంగళవారం నిర్వహించిన పదవ తరగతి హిందీ పరీక్షకు 28 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి ఎల్.బాలు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి మొత్తం 1,103 మంది రెగ్యులర్ విద్యార్థులు, 32 మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారు. వీరిలో 1,075 మంది రెగ్యులర్ విద్యార్థులు, ఆరుగురు ప్రైవేట్ విద్యార్థులు హాజరు కాగా 28 మంది రెగ్యులర్, 26 మంది ప్రైవేట్ విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి బాలు తెలిపారు.

జి.కొండూరు: పదో తరగతికి మంగళవారం నిర్వహించిన హిందీ పరీక్షకు ఐదు పరీక్షా కేంద్రాల్లో 654 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 641 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా ప్రైవేటు విద్యార్థులు ఐదుగురు హాజరవ్వాల్సి ఉండగా ఒకరు పరీక్షకు హాజరైనట్లు వివరించారు.

విస్సన్నపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు విస్సన్నపేటలో ఆరు కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మంగళవారం జరిగిన పరీక్షలకు 1,126 మంది విద్యార్థులకు గాను 1,071 మంది హాజరయ్యారని, 55 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని ఎంఈఓ-2 సుధాకర్ తెలిపారు.

ముసునూరు: పదో తరగతి పరీక్షలలో భాగంగా రెండో రోజు నిర్వహించిన హిందీ పరీక్షకు మండలంలో రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు కలిపి 580 మంది హాజరైనట్లు ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు తెలిపారు. ముసునూరులో 200 మంది, చెక్కపల్లిలో 234 మంది, గోపవరంలో 146 మంది హాజరయ్యారని చెప్పారు. ముసునూరులో 7గురు, చెక్కపల్లిలో 17 మంది, గోపవరంలో 11 మంది కలిసి మొత్తం 35 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పీహెచ్‌సీ వైద్యులు షకీనా ఇవాంజిలిన్, కరీముల్లా వైద్య శిబిరం ఏర్పాటు చేయగా, ఎస్ఐ పి.వాసు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సచివాలయ వ్యవస్థతో తీరిన కష్టాలు



తుక్కులూరులోని సచివాలయ భవనం



దేవరగుంటలోని గ్రామ సచివాలయం



జంగంగూడెంలోని గ్రామ సచివాలయ భవనం



గొల్లపల్లిలోని గ్రామ సచివాలయ భవనం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2019లో ఏర్పాటైన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన విప్లవాత్మకమైన చర్యలలో గ్రామ సచివాలయాల వ్యవస్థ ఒకటి. దీని ద్వారా ప్రభుత్వ సేవలన్నింటినీ గ్రామస్థాయిలోనే ప్రజల గడప వద్దకు వచ్చాయి. అంతకుముందు పింఛన్లు, రేషన్ కార్డులు కావాలన్నా, ఆదాయ, నివాస, కుల, ఎన్‌వోసీ, పుట్టినరోజు, మరణ తదితర ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి పోయింది. ఫలానా సర్టిఫికెట్ కావాలని వలంటీర్‌కు చెబితే చాలు వారు వెంటనే వచ్చి కావాల్సిన దరఖాస్తుపై సంతకాలు చేయించుకొని తీసుకెళ్లి సచివాలయంలో అందజేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో సర్టిఫికెట్లు వస్తున్నాయి. ఇలా గడప వద్దకే ప్రభుత్వ పాలన అందుబాటులోకి వచ్చింది. స్వాతంత్య్రం వచ్చిన తరువాత ఇలాంటి వ్యవస్థ దేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంది. దీనిని బట్టే ప్రభుత్వం ప్రజలకు ఏ విధంగా పాలనను అందిస్తుందో చెప్పవచ్చు. ప్రతి గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో గ్రామ సచివాలయ భవనాలను నిర్మించి అందులో అన్ని హంగులను ఏర్పాటు చేశారు. గ్రామస్థాయిలో ఇలాంటి భవనాలు ఏర్పాటు కావడం అభివృద్ధి కాదా అని పలువురు విద్యావంతులు ప్రశ్నిస్తున్నారు.

–నూజివీడు

బాలికా సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న డాక్టర్ రాణిరుద్రమ, పాల్గొన్న కళాశాల వలంటీర్లు, విద్యార్థులు

కనిమెర్ల తండా(మైలవరం): బాలికా సంరక్షణ అందరి బాధ్యత అని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సహేలీ గరల్స్ క్లబ్ మెంటార్ డాక్టర్ కే రాణిరుద్రమ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల దత్తత గ్రామం కనిమెర్ల తండాలో వారం రోజులు నిర్వహించనున్న స్పెషల్ క్యాంప్ నాలుగవ రోజు మంగళవారం కొనసాగింది. స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో నిర్వహించిన స్పెషల్ క్యాంప్‌లో భాగంగా ‘బాలికా సంరక్షణ అందరి బాధ్యత’ అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. డాక్టర్ రాణిరుద్రమ మాట్లాడుతూ బాలికల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాలికలు, స్త్రీలపై దాడులు జరగకుండా చూడాలని, దిశ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలు, స్త్రీలు నూతన పరిచయాలతో జాగ్రత్తగా ఉండాలని, ఆపదలో ఉంటే 1098, 100, 181టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు. సామాజిక మాధ్యమాలలో కూడా జాగ్రత్తలు వహించి, వ్యక్తిగత సమాచారం లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.శివ హరిప్రసాద్, ఇన్‌చార్జి ఎస్.ఉమామహేశ్వరరావు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌కు సన్మానం

అక్కిరెడ్డిగూడెం (ముసునూరు): నూజివీడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్‌చైర్మన్‌గా నియమితుడైన బర్మా సీతారామయ్యకు శాలివాహన సంఘ నేతలు అభినందనలు తెలిపారు. అక్కిరెడ్డిగూడెంలో మంగళవారం రాత్రి స్థానిక శాలివాహన సంఘ నేతలు, యువకులు సీతారామయ్యను శాలువలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

ముసునూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనేసమాచారంతో దాడులు నిర్వహించి మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పి.వాసు తెలిపారు. చెక్కపల్లికి చెందిన తాళం పెద ఆంజనేయులు గ్రామంలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి మద్యం బాటిల్స్ తెచ్చి విక్రయిస్తుండడంతో నిఘా పెట్టి మంగళవారం పోలీసులు దాడులునిర్వహించారు. ఈదాడిలో ఓల్డ్ టైమర్ 180 ఎంఎల్. ఐదు బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బుధవారం నిందితుడిని నూజివీడు కోర్టుకు హాజరుపరుస్తామన్నారు.

10 మందిపై కేసులు నమోదు



ముసునూరులో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ వాసు

ముసునూరు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మద్యం తాగి వాహనాలు నడిపినా, జరిమానాలు, శిక్షలు తప్పవని ఎస్ఐ పి.వాసు హెచ్చరించారు. మంగళవారం రాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 10 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ రహదారుల పక్కన, ఫుట్‌పాత్‌లు, వంతెనలపైన మద్యం తాగినా, మత్తులో వాహనాలు నడిపినా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. పట్టుబడిన వారిని బుధవారం నూజివీడు కోర్టుకు తరలించనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రధాన న్యాయమూర్తికి ఘన సత్కారం



నందిగామలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సత్కరిస్తున్న పలువురు న్యాయమూర్తులు

నందిగామ: నందిగామలో మంగళవారం రాత్రి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారికతో కలిసి పలువురు న్యాయమూర్తులు ఘనంగా సత్కరించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కూడా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సత్కరించారు. నూతన కోర్టు భవనాల ప్రాంగణంలో పలువురు హైకోర్టు న్యాయమూర్తులు మొక్కలు నాటారు. కోర్టు భవనాలలోని అన్ని గదులను పరిశీలించారు. ముఖ్యంగా కోర్టు భవనాలలో కల్పించిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. రాత్రి పొద్దు పోయే వరకు జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాసరావు, పలు కోర్టులకు చెందిన న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.


ఫ్యామిలీ కోర్టు ఏర్పాటుచేయాలి..

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కు నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పలు వినతులు చేశారు. పట్టణానికి వచ్చిన న్యాయమూర్తిని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు కలిసి పట్టణంలోని జిల్లా 16వ అదనపు కోర్టును కూడా కోర్టు ప్రాంగణాలలో ఏర్పాటు చేయాలని, కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. నందిగామలో ఫ్యామిలీ కోర్టు, అడిషనల్ సివిల్ జడ్జి కోర్టు కూడా ఏర్పాటు చేయాలని కోరినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జునరావు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

విస్సన్నపేట: విస్సన్నపేట గ్రామం శివారు పొలాల్లో పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ మంగళవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9,720 నగదు, ఏడు బైకులు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. పేకాట, కోడి పందేలు ఇతర జూదాల సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

ప్రచారాలకు అనుమతులు తప్పనిసరి



వత్సవాయి: గ్రామాల్లో అనుమతులు లేకుండా పార్టీ ప్రచారాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని ఎంపీడీవో, మండల ఎంసీసీ టీసీకేజే భరత్‌రాజ్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాలలో ఉన్న ఫ్లెక్సీలను మంగళవారం తొలగించడంతో పాటు జెండాల దిమ్మెలపై గుర్తులు కనపడకుండా పార్టీ రంగులతో ఉన్న వాటిపై తెల్లరంగులు వేయించారు. మైకుల ద్వారా ప్రచారం నిర్వహిస్తే కచ్చితంగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.